ప్రజాశక్తి

మంగళవారం 17 సెప్టెంబర్ 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు







పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కొండమోడులో ఖాళీ అయిన ఇసుక స్టాక్ పాయింట్

పల్నాడులో ఇసుక కొరత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఇసుక సరఫరా సరిగా లేకపోవడంతో భవన నిర్మాణ దారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు . వరదలు, భారీ వర్షాల వల్ల దాదాపు వారం పాటు పనులు లేకుండా పోయాయి. తీరా వర్షం తగ్గి పనులు చేపట్టే సమయానికి ఇసుక సరఫరా లేకపోవడంతో కార్మికుల ఉపాధికి తీవ్ర విఘాతం కలుగుతోంది.

- **గుంటూరు జిల్లాలో పాక్షికంగా సరఫరా**
- **ఉపాధి లేక ఇబ్బందుల్లో భవన నిర్మాణ కార్మికులు**
- **ధరలపైనా వినియోగదారుల్లో అసంతృప్తి**

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలుపై ఇంకా అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. గత 15 రోజులుగా పల్నాడు జిల్లాలో ఇసుక అందుబాటులో లేదు. వరదలకు ముందు కేవలం మాదిపాడు స్టాక్ పాయింట్ ద్వారా ఇసుక తీసుకునేందుకు అవకాశం ఇచ్చారు. గతనెల 31వ తేదీ నుంచి వరదలు రావడంతో పల్నాడు జిల్లాలో ఇసుక సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. తొలుత కొండమోడు, మాదిపాడు రీచ్‌ల నుంచి ఉచిత ఇసుక పేరుతో టన్ను రూ.192కు నిర్ధారించి కొద్ది రోజులు సరఫరా చేశారు. ఆ తరువాత సరఫరాను మాదిపాడుకు పరిమితం చేశారు. ఈనెల 2న మాదిపాడులో 24,755 టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, ఇక్కడ నుంచి ఇసుక తీసుకువెళ్లవచ్చునని అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత ఇంత వరకు మళ్లీ ఎటువంటి ప్రకటనా చేయలేదు. రెండో తేదీ నుంచి వరద తీవ్ర రూపం దాల్చడంతో సరఫరా నిలిపివేశారు. దీంతో పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఇసుక కొరత ఏర్పడింది. ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ పై ప్రభుత్వం త్వరలో వెబ్‌సైట్ విడుదల చేస్తుందని అప్పటి వరకు ఆగాలని అధికారులు చెబుతున్నారని మాదిపాడు స్టాక్ పాయింట్ వద్ద వేచి ఉన్న వాహనదారులు చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో టన్ను రూ.1050 నుంచి రూ.1400 వరకు పలికింది. వైసిపి ప్రభుత్వ హయాంలో నెలకొన్న పరిస్థితికి ఇప్పటికీ పెద్ద తేడా లేదని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. జులై 8న ప్రకటించిన ఇసుక విధానంలో లోపాలు ఉండటంతో తిరిగి నూతన ఇసుక విధానం ప్రకటిస్తామని గత 15 రోజులుగా అదిగో..ఇదిగో అంటూ ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. దీంతో ▶ 2లో

అక్షరాస్యత పెరిగితేనే అభివృద్ధి

- **నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు**
- **పల్నాడు బాలోత్సవం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం**

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికి సమాజం ఎంతో విలవనిస్తుందని, ఆ వృత్తికి మరింత వన్నె తెచ్చేలా ఉపాధ్యాయులు పని చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. విద్యాశాఖ గుర్తించిన 67 మంది ఉత్తమ ఉపాధ్యాయులను పల్నాడు బాలోత్సవం ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం సన్మానించారు. కార్యక్రమానికి పల్నాడు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎంపీ మాట్లాడుతూ పల్నాడులో అక్షరాస్యత శాతం పెంచడంతో పాటు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, అందుకు తమ సహకారం ఉంటుందని చెప్పారు. అక్షరాస్యత పెంచడం ద్వారానే పల్నాడు ప్రాంతం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం, అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించాలని కోరారు. మోడల్ స్కూల్, కెజిబివి పాఠశాలల పని తీరును మెచ్చుకున్నారు. ఉపాధ్యాయుల్లో రాజకీయ చైతన్యం ఎక్కువని, ఇటీవల ఎన్నికల్లో కూటమి గెలుపులో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ విద్యార్థి జీవితం తరగతి గదిలో ప్రారంభం అవుతుందని, వారిని ఉత్తమ పౌరులుగా సమాజానికి అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. బడి బయటి పిల్లలను గుర్తించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచాలని సూచించారు. బాలోత్సవాల అధ్యక్షులు సిహెచ్. రాజగోపాల్ రెడ్డి (రాజారెడ్డి) మాట్లాడుతూ బాలోత్సవాలను ▶ 2లో



సత్కారం పొందిన ఉపాధ్యాయులతో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

29న జెవివి ఆధ్వర్యంలో ఎసి కాలేజీలో పిల్లల కథల పోటీలు

8లో

ముగిసిన యుటిఎఫ్ క్రీడా, సాంస్కృతిక పోటీలు



ఉండవల్లిలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రాజధానికి కేంద్రం నిధులు విడుదల చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. రాజధానిలో వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించాలని, రాజధాని రైతులు, అసైన్డ్ రైతులకు పెండింగ్‌లో ఉన్న వార్షిక కౌలు వెంటనే చెల్లించాలని కోరారు. ఉండవల్లిలోని సిపిఎం కార్యాలయంలో సిహెచ్.సుందరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో తొలుత సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ ఇటీవల వర్షాల కారణంగా కృష్ణా నదికి వరదలు సంభవించి వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం వెంటనే అంచనా వేసి బాధిత రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కంద, పసుపు, అరటి, పూల తోటలు, కూరగాయల తోటలు దెబ్బతిన్నాయని, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.లక్ష, వరికి ఎకరాకు రూ.30 వేల నష్టం జరిగిందని చెప్పారు. ఈ నేపథ్యంలో రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ రాజధానిలో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు పని కల్పించేందుకు నర్సరీలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని కోరారు. గత ప్రభుత్వం తొలగించిన రాజధాని పేదలకు, అసంఘటిత కార్మికులకు సామాజిక పింఛను పునరుద్ధరించాలన్నారు. రాజధాని గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, అసెంబ్లీ, హైకోర్టులో పనిచేస్తున్న హౌస్ కీపింగ్ కార్మికులకు రూ.21 వేల జీతం ఇవ్వాలని కోరారు. రాజధానిలో నిర్మించిన టిడ్కో గృహాల బ్యాంకు రుణాలను రద్దు చేయాలన్నారు. సమావేశంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు, ఈ.రామారావు, ఎస్‌కె ఎర్రపీరు, కె.వెంకటేశ్వర్లు, జి.కృష్ణ, పి.బాబూరావు, కె.ఆంజనేయులు, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆటోబోల్తా - ఇద్దరు వృద్ధులు దుర్మరణం

▶ 3లో



టైల్‌పాండ్‌లో నిల్వ ఉన్న నీరు

పులిచింతలకు 46867 క్యూసెక్కులు విడుదల

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని సత్రశాల వద్ద కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 46867 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఇ వెంకటరమణ సోమవారం తెలిపారు. ప్రాజెక్టుకు చెందిన మూడు రేడియల్ క్రస్ట్ గేట్లను రెండున్నర మీటర్లు ఎత్తి 38,439 క్యూసెక్కులు, టైల్ రేస్ ఛానల్ ద్వారా 8428 క్యూసెక్కులు, మొత్తంగా 46,867 క్యూసెక్కుల దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్లు ద్వారా 1.0111 ఎంయూల విద్యుత్ ఉత్పత్తయిందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్లో 75.5 మీటర్ల మేర నీరు నిల్వ ఉండగా ఇది 7 టీఎంసీలకు సమానమని చెప్పారు.

అక్షరాస్యత పెరిగితేనే అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతం చేయడంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల కృషి మరువలేనిదని, ఈ ఏడాది నిర్వహించబోయే ఉత్సవాలకూ సహకరించాలని కోరారు. అమరావతి బాలోత్సవం బాధ్యులు యువి రామరాజు మాట్లాడుతూ పిల్లల్లోని సృజనాత్మకతను బయటకు తీయటానికి బాలోత్సవాలు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం సహకరిస్తే ప్రతి మండల కేంద్రంలో బాలోత్సవాలు నిర్వహించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోని 100 కేంద్రాల్లో బాలోత్సవాల నిర్వహణ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా పల్నాడు బాలోత్సవం సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. సావనీర్ ఉద్దేశాన్ని ఎన్‌సిఆర్‌టి పుస్తక రచయిత ఎ స్.కె.గౌస్ వివరించారు. ఈ సందర్భంగా బాలబాలికల నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బాలోత్సవాల కమిటీ గౌరవాధ్యక్షులు ఎం.ఎస్.ఆర్.కె ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎన్.రామారావు, ఎఎం.రెడ్డి కళాశాలల సెక్రటరీ ఎ.శాంతి శ్రీనివాసరెడ్డి, ఎం.సాంబశివరావు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎ.భాగేశ్వరి దేవి, దేవి, ఉస్మాన్, రామిరెడ్డి, ఉపాధ్యాయులు పెండ్యాల ప్రసాద్, అంజిరెడ్డి, కెజెబివి డైరెక్టర్ మధుసూదనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్నాడులో ఇసుక కొరత

(మొదటి పేజీ తరువాయి)

పల్నాడు జిల్లాలో ఎక్కడా ఇసుక సరఫరా కాని పరిస్థితి నెలకొంది.

గుంటూరు జిల్లాలో గతనెల 30కు ముందు బుక్ చేసుకుని లోడింగ్ సమయం ఇచ్చిన వారికి ఈనెల 15 నుంచి 23 వరకు తాళ్లాయపాలెం ఇసుక రీచ్‌లో ఇసుకను సరఫరా చేస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు. గతంలో లింగాయపాలెం, తాళ్లాయపాలెంకు సంబంధించిన వినియోగదారులు బుక్ చేసుకుని ఉన్న వారికి మాత్రమే తాళ్లాయపాలెంలో గత రెండ్రోజులుగా లోడింగ్ చేస్తున్నారు. రోజుకు 360 వాహనాలకు అనుమతి ఇస్తున్నారు. ఈనెల 21న 451 వాహనాలు, 22న 360, 23న 440 వాహనాలకు అనుమతిస్తారు. 20వ తేదీ వరకు మాత్రం తాళ్లాయపాలెంలో కేవలం 360 వాహనాలకు మాత్రమే అనుమతిస్తారు. జిల్లాలో సంభవించిన వరదల నేపథ్యంలో ఈ మార్పు చేసినట్టు అధికారులు తెలిపారు. మరోవైపు జిల్లా మొత్తం మీద కేవలం తాళ్లాయపాలెం రీచ్‌లోనే ఇసుక సరఫరా చేయడం వల్ల పలు ప్రాంతాలకు చెందిన వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా ప్రత్తిపాడు, పొన్నూరు, తెనాలి నియోజకవర్గాలకు తాళ్లాయపాలెం నుంచి ఇసుక తీసుకువెళ్లడం వల్ల రవాణా ఛార్జీల భారం తప్పడం లేదు. టన్ను రూ.250 అని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఇంటికి చేరే సరికి టన్ను రూ.1200 నుంచి రూ.1600 వరకు పడుతోంది.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఉచిత ఇసుక విధానం విఫలం కావడానికి రవాణా ఛార్జీలు అధికంగా వసూలు చేయడం, అనధికారికంగా స్థానిక నాయకులు వసూళ్ల పర్వంతో ఈ విధానం అభాసుపాలైంది. కొంచెం ధర తగ్గిందే తప్ప ఉచితం ఏదీ లేదనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నూతన విధానం రూపకల్పనకు ప్రభుత్వం చేస్తున్న కసరత్తు కొలిక్కిరాలేదు. కిలో మీటరుకు టన్నుకు రూ.7 చొప్పున తీసుకోవాలని ప్రభుత్వం లారీ యజమాలను కోరగా రెండ్రోజుల క్రితం రాష్ట్ర స్థాయిలో జరిగిన చర్చల్లో టన్నుకు కిలో మీటరుకు గరిష్టంగా రూ.13.5 చెల్లించేందుకు ఒప్పందం కుదిరినట్టు తెలిసింది. ఇప్పటి వరకు స్టాక్ పాయింట్‌ల వద్దకు టన్ను రూ.192, రూ.250 చొప్పున ఒక్కో జిల్లాలో ఒక్కో ధర నిర్ణయించినా గరిష్టంగా టన్ను రూ.1600 వరకు పడుతోందని వినియోగదారులు చెబుతున్నారు. దీంతో ఉచిత ఇసుక విధానం వల్ల వినియోగదారులకు పాక్షిక ప్రయోజనాలు అందుతున్నాయి. తక్కువ స్టాక్ యార్డుల వల్ల దూరం పెరిగి భారం మరింత పెరుగుతోంది. గత నెలలో కొద్ది రోజులు గుంటూరు జిల్లాలో నాలుగు స్టాక్ పాయింట్‌లు, పల్నాడు జిల్లాలో రెండు స్టాక్ పాయింట్‌లు నిర్వహించారు. కానీ ఈనెల మొదటి నుంచి పల్నాడులో సరఫరా పూర్తిగా నిలిచిపోగా, గుంటూరు జిల్లాలో తాళ్లాయపాలెం నుంచి మాత్రమే సరఫరా అవుతోంది. ఇందువల్ల మళ్లీ కొరత ఏర్పడి సమస్యలు పెరుగుతున్నాయి.

వరిలో సస్యరక్షణే పంటకు రక్షణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో అధిక శాతం రైతులు వరి సాగు చేస్తున్నారు. మొత్తంగా 1.30 లక్షల ఎకరాల్లో వరిసాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే సాగైన పైరు గింజ పోసుకునే దశలో ఉంది. ఈ దశలో పురుగులు, తెగుళ్ల ఎక్కువగా ఆశిస్థాయి. ప్రస్తుతం సుడిదోమ, మోగి పురుగు, పాము పొడ, నల్ల కంకి లాంటి తెగుళ్ల సోకే అవకాశం ఉంది. సరైన సస్యరక్షణ చర్యలు తీసుకోకుంటే దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో తమ సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని వ్యవసాయ శాఖ నరసరావుపేట ఎడిఎ పి.మస్తానమ్మ చెబుతున్నారు. వరిలో నారుమడి దగ్గర నుండి పైరు పాలు పోసుకునే దశ వరకూ వ్యాపించే కాండం తొలిచే పురుగు ఉధృతి ఉంటుందని, పురుగు సోకిన ప్రాథమిక దశ నుంచే సమగ్ర యాజమాన్యం చర్యలు తీసుకోవాలని రొంపిచర్ల మండల వ్యవసాయ శాఖాధికారి పి.విజయభాస్కర్ పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులు వరి సాగుకు నారు మడులు సిద్ధం చేస్తున్న నేపథ్యంలో మండలంలో పర్యటిస్తూ యాజమాన్య చర్యలను రైతులకు వివరిస్తున్నారు.



కాండం తొలిచే పురుగు జీవిత చక్రం



ఒక్కొక్క గుంపునకు 20 నుంచి 80 గుడ్ల వరకు ఉంటాయి. తల్లి పురుగు కనీసం 300 గుడ్ల వరకు పెడుతుంది. ఈ గుడ్లు ఐదు నుంచి ఏడు రోజులు పొదిగాక పురుగులు బయటకు వస్తాయి. లార్వా దశ పూర్తికాలం 30 నుంచి 40 రోజులు ఉంటుంది. పూర్తి జీవితచక్రానికి పట్టే రోజులు 50 నుంచి 70 రోజులు.

పసుపు రంగులో పురుగు

తల్లి పురుగు పసుపు రంగులో ఉండి రెక్కల మధ్యలో నల్లటి మచ్చులు, ఉదరం చివర పట్టు వంటి వెంట్రుకలను కుచ్చుగా కలిగి ఉంటుంది. మగ పురుగైతే పరిమాణంలో ఆడ పురుగుకంటే చిన్నగా, గోధుమ వర్ణాన్ని పోలి ఉంటుంది. పైరు చిరు పొట్ట దశ ఏర్పడిన తరువాత పురుగు ఆశిస్తే వెన్నులో నుంచి గింజలకు పోషకాలు అందక ధాన్యపు గింజలు తాలుగా మారతాయి. తల్లిరెక్కల పురుగు గుడ్లను ఆకు చివరి పైభాగంలో గుంపుగా మొక్క పైభాగంలో చేరి ఆకు తొడిమ పైనున్న పత్రహరితాన్ని తింటాయి. పూర్తిగా ఎదిగిన ఈ పురుగు పైరు లోపల కోశస్థ దశకు చేరుకుంటాయి. పైరు పిలకలు వేసే దశలో గుడ్ల నుంచి వెలువడిన వెంటనే మొదటి దశ పిల్ల పురుగులు ఆకు కొమ్మను చేరుకుని, పత్రహరితాన్ని తింటాయి. దీనివల్ల పైరుకు తెల్లని చారలుగా ఏర్పడతాయి. ఈ పురుగు కాండం లోపలికి చేరి కణజాలాన్ని తినడంతో ముువ్వ ఆకులు విడిపడక ముువ్వకుళ్లు ఏర్పడుతుంది.

నారుమడి నుంచే యాజమాన్య చర్యలు

వరినారు పెంచే నేలను దమ్ముచేసి చదును చేయాలి. నీరు పెట్టటానికి, తీయటానికి వీలుగా ఏర్పాటు చేసుకోవాలి. ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని (1కిలో విత్తనం చల్లేముందు, మరో కిలో విత్తిన 12-14 రోజులకు), కిలో భాస్వరం, కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేసుకోవాలి. నారు తీయడానికి వారం ముందే కార్బోఫ్యూరాన్ గుళికలను సెంటు భూమికి 150 గ్రాముల చొప్పున నీటిలో ఇసుకతో కలిపి నారుమడిలో చల్లడంతోపాటు నాటేటప్పుడు నారుకట్టల చివర్లు తుంచివేయాలి. చదరపు మీటరుకు ఒక తల్లి రెక్క పురుగు లేదా గుడ్ల సముదాయం లేదా ఐదు శాతం మొక్క చచ్చిన కర్రలు ఉంటే పురుగు మందులను వాడాలి.

కాండం తొలుచు పురుగు - నివారణా చర్యలు


వరి పిలకలు తొడిగే దశలో ఎకరానికి ఒక లీటరు నీటికి క్లోరీ పైరీపాస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా పాస్ఫామిడాన్ 2 మిల్లీ లీటర్లను లీటరు నీటిలో కలిపి స్ప్రే చేస్తే నివారణ చేయవచ్చు. అంకురం దశలో 10 నుంచి 15 రోజుల సమయంలో ఎకరానికి కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 10 కిలోలు లేదా లేదా 4జి గుళికలు ఎకరానికి ఎనిమిది కిలోల చొప్పున చల్లుకోవాలి. పురుగు మందులైతే ఎకరానికి లీటరు నీటికి క్లోరీపైరీపాస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా ఎస్పేట్ 1.5 గ్రాములు లేదా కాట్రాఫ్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాముల చొప్పున పిచికారీ చేయాలి.

మోగి పురుగు-నివారణ



మోగి పురుగు వరి పంటకు నారుమడి దశలో నుంచి కంకి పోసుకునే దశ వరకు ఆశిస్తుంది. తల్లి పురుగు ముదురు రంగులో ఉండి ముందు రెక్కలపై నల్లటి మచ్చలను కలిగి ఉంటుంది. గోధుమ రంగు వెంట్రుకలతో కలిపిన గుడ్లను గుంపులుగా నారు మడుల్లో పెడతాయి. ఈ పురుగు నారుమడిలో కొనలపై గుడ్లు పెడితే నాటు వేసే సమయంలో తుంచివేయాలి. నాటిన తర్వాత చిరుపొట్ట కొనల దశలో పురుగును గమనిస్తే ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ లేదా ఎనిమిది కిలోల కరెక్ట్ హైడ్రో క్లోరైడ్ గుళికలను పొలంలో వేయాలి.

ఎన్‌టిఆర్, డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాల ఆవిష్కరణ



నరసరావుపేటలో ఆవిష్కరించిన ఎన్టీఆర్, కోడెల విగ్రహాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం 11వ వార్డు 60 అడుగుల రోడ్డులో నందమూరి తారక రామారావు, కోడెల శివప్రసాదరావు విగ్రహాలను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు సోమవారం ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎన్టీఆర్, పల్నాడు ప్రజల గుండెల్లో డాక్టర్ కోడెల నిలిచి ఉంటారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసరావుపేటలో కోడెల స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నామని, దీనికి సంబంధించి అనుమతులు కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చారని, త్వరలోనే వనం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రాము, నాయకులు డాక్టర్ కోడెల శివరామకృష్ణ, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, వేములపల్లి వెంకట నరసయ్య, నాగసరపు సుబ్బరాయగుప్తా, కపిలవాయి విజయ కుమార్, జనసేన నాయకులు సయ్యద్ జిలానీ, వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, వల్లెపు నాగేశ్వరావు, జి.జానార్ధన్‌బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఉమ్మడి గుంటూరు జిల్లా రాజకీయాల్లో డాక్టర్ కోడెల శివప్రసాదరావు చెరగని ముద్ర వేసుకున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కోడెల శివప్రసాదరావు 5వ వర్ధంతిని సత్తెనపల్లి పట్టణం రఘురాం నగర్ ప్రజా వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకా సెంటర్‌లో కోడెల విగ్రహానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సత్తెనపల్లి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌కు కోడెల గెస్ట్ హౌస్‌గా నామకరణం చేశారు. కోడెల వర్ధంతి సందర్భంగా డిఎర్ సుబ్రహ్మణ్యంకు ప్రతిభా అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్నాడు ప్రాంత అభివృద్ధికి డాక్టర్ కోడెల విశేష కృషి చేసి అభివృద్ధి ప్రదాతగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని వివిధ గ్రామాల్లో కోడెల వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోడెలశిరాం, కార్యనిర్వహణ కార్యదర్శి యెలినేడి రామస్వామి, మండల అధ్యక్షులు ఆళ్ల అమరేశ్వరరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో కోడెల శివప్రసాదరావు విగ్రహానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

అఖిల భారతీయ బ్రహ్మణ మహాసంఘం నూతన కమిటీ

ప్రజాశక్తి - అమరావతి

పల్నాడు జిల్లా అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం పల్నాడు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఐ.ప్రసాద్ శర్మ సోమవారం తెలిపారు. ఈ మేరకు స్థానిక యోగ ఆశ్రమంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అధ్యక్షులుగా కౌశిక వెంకటప్రసాద్ శర్మ మరో 20 మందిని సభ్యులను ఎన్నుకున్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నేడు రక్తదాన శిబిరాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా శాఖ తెలిపింది. పల్నాడు రోడ్డులోని ఎస్.ఎస్.ఎన్ కళాశాల ఆడిటోరియంలో, వాగ్దేవి కళాశాల ప్రాంగణంలో, కాకాని గ్రామ పరిధిలో గల జె.ఎన్.టి.యు కళాశాలలో ప్రత్యేక రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా చైర్మన్ నరసరావుపేట కొండవీడు ముక్కు చెవి గొంతు హాస్పిటల్ అధినేత కంజుల జగన్మోహన్ రెడ్డి సోమవారం తెలిపారు.

రోడ్లపై, కాల్వల్లో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులో రోడ్ల వెంబడి కొబ్బరి బోండాలు, టిఫిన్, టీ విక్రయదారులు వ్యర్థాలను రోడ్ల మీద, డ్రైన్లలో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అటువంటి వారికి భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ ఏటి అగ్రహారం, శాంతినగర్, జిటి రోడ్, సంపత్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యం, అభివద్ధి పనులను పరిశీలించారు. ప్రధాన రహదారుల వెంబడి ఉన్న వివిధ వ్యాపారాలు చేసే వారు వ్యర్థాలను రోడ్ల మీద, కాల్వల్లో వేస్తున్నారని, కొబ్బరి బోండాలు డ్రైన్లలో వేయడం వలన మురుగుపారుదలకు అడ్డంకి ఏర్పడుతుందన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాంతి నగర్, సంపత్ నగర్‌లో స్థానిక ప్రజల నుండి అందిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఆయా విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో డిఈఈ రమేష్ బాబు, టిపిఎస్ లక్ష్మణ స్వామి తదితరులు పాల్గొన్నారు.



కొబ్బబోండాల విక్రేతలతో మాట్లాడుతున్న కమిషనర్

నేడు స్వచ్ఛతా హి సేవా ప్రతిజ్ఞ

స్వచ్ఛత హి సేవ లో భాగంగా నేడు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని స్వచ్ఛత హి సేవా ప్రతిజ్ఞ నిర్వహిస్తున్నట్లు జిఎంసి కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా గుంటూరులో 17 నుండి అక్టోబర్ 2 వరకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని, మొదటి రోజు ప్రతిజ్ఞ ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు జిఎంసి ప్రధాన కార్యాలయం, 10:30 గంటలకు వార్డు సచివాలయాల్లో, సాయంత్రం 4:30 గంటలకు తూర్పు నియోజకవర్గంలో విజ్ఞాన మందిరంలో, పశ్చిమ నియోజకవర్గంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ప్రతిజ్ఞ జరుగుతుందని తెలిపారు. కావున ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు పొందిన అరుదైన వ్యక్తులలో సీతారాం ఏచూరి ఒకరని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. వినుకొండ రోడ్డు లోని ఎస్ డబ్ల్యు ఎఫ్ కార్యాలయంలో సోమవారం ఏచూరి వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్, ఎస్ డబ్ల్యూ ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారావులు కామ్రేడ్ ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ భారత దేశ కమ్యూనిస్టు యోధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి కామ్రేడ్ ఏచూరి ఆశయ సాధనకు ప్రజా ఉద్యమాలు చేయడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ ఏచూరి మరణం కార్మిక, వామపక్ష, ప్రజా ఉద్యమానికి తీరని లోటన్నారు. మంచి కమ్యూనిస్టు నాయకుడిని సిపిఎం కోల్పోయిందని ఆయన ఆకాల మరణం యావత్ కార్మిక, ఉద్యమకారులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. విద్యార్థి దశ నుండే మెరుగైన సమాజం నిర్మాణం కోసం పోరాటం ప్రారంభించిన ఆయన ఇటీవలి కాలం వరకు దేశం లోని అన్ని రాజకీయ పార్టీలు మెచ్చుకునే పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో కామినేని రామారావు, డి శివకుమారి, జి. మల్లీశ్వరి, సిలార్ మసూద్, ఎస్ ఆంజనేయ నాయక్,ఎస్ డబ్ల్యూ ఎఫ్ నాయకులు కోటేశ్వరరావు, కష్ణ, శ్రీనివాసరావు, మస్తాన్ రావు, పెద్ద సింగ్, మస్తాన్వలి,సుభాస్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న గుంటూరు విజయకుమార్ తదితరులు

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - నాదెండ్ల



అనుమానాస్పద స్థితిలో డి జయమ్మ (35) మహిళ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం నాదెండ్ల మండలంలో చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్ఐ పుల్లారావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గొరిజవోలు గ్రామంలో జ్యోతిర్మయి స్పిన్నింగ్ మిల్లులో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన దొంగ జయమ్మ ఆమె భర్త తమ్మయ్య, గత ఆరు సంవత్సరాలుగా పని చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు క్వార్టర్స్‌లో చీరతో ఫ్యాన్‌కి ఉరివేసు కొని చనిపోయినది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివరాలు పూర్తిగా తెలియలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా - ఇద్దరు వృద్ధులు దుర్మరణం

ప్రజాశక్తి - వినుకొండ



ఆటో బోల్తా కొట్టిన ప్రమాదంలో ఇద్దరు వృద్ధులు మృతి చెందిన సంఘటన నూజెండ్ల మండలంలోని పమిడిపాడు గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగింది. అయినవోలు ఎస్సై కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం పమిడిపాడు నుండి వినుకొండకు వస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో పమిడిపాడు గ్రామానికి చెందిన కోటిలింగం (70) వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన పానకాల వెంకటేశ్వర్లు (65) ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వినుకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ మేరకు అయినవోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అమృతపూడి రేవతికి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - వినుకొండ



విజయవాడ బాలోత్సవ భవన్‌లో తెలుగు వెలుగు సాహితీ వేదిక నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ సందర్భంగా పట్టణానికి చెందిన కవయిత్రి అమృతపూడి రేవతికి జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. ఆమెకు పట్టణానికి చెందిన కమలా రామ్, ఎ.విజయరాజు, రవీంద్రబాబు, ఎం.వెంకట్రావు శుభాకాంక్షలు తెలిపారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు


కలెక్టరేట్‌లోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఈనెల 18న ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ ఉచిత వైద్య శిబిరం నిర్వ హిస్తున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మరణించిన అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎన్.వి. నరసింహారావు సంస్మరణార్థం ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ ఎఎవి.రామలింగారెడ్డి, ప్రత్యూష డెంటల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ప్రత్యూష కొండా, డాక్టర్ మోహన్స్ డయాబెటీస్ సెంటర్ వైద్యులు పాల్గొంటారని, ఎపి ఎన్‌జిఒ మాజీ రాష్ట్ర అధ్యక్షులు జి.పూర్ణచంద్రరావు ఈ శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. విశ్రాంత ఉద్యో గులు, ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు వినియోగించుకోవాలని కోరారు.



ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన రాష్ట్ర బృందం

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో సాగవుతున్న పత్తి పొలాలను ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర బృందం సోమవారం పరిశీలించింది. నేలలో నీరు ఇంకిపోయే శక్తి, మొక్కలో వ్యాధి నిరోధక శక్తి, పురుగు, తెగుళ్ల బెడద, భూమిలో వానపాములు పరీక్షలు నిర్వహించారు. బృంద సభ్యులు రవిచంద్ర మాట్లాడుతూ మూడేళ్లు పైబడి ప్రకృతి వ్యవసాయం చేస్తూ తొలకరి వర్షాలకు ముందు 30 రకాల విత్తనాలు చల్లిన క్షేత్రాల్లో భూమిలో నీటిని నిలుపుకునే శక్తి ఎక్కువగా ఉందని చెప్పారు. మొక్కల్లో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉండటంతో పాటు పురుగు, తెగుళ్ల తక్కువగా తక్కువగా ఉన్నాయన్నారు. భూమిలో వానపాములు ఎక్కువగా ఉండటం గమనించామని తెలిపారు. కార్యక్రమంలో బృంద సభ్యులు సైదయ్య, శ్రీలక్ష్మి జ్యోతి, మధుబాబు, యూనిట్ ఇన్‌ఛార్జి అమూల్య, ఐసిఆర్‌పిలు ఉదయలక్ష్మి, మహబ్బీ, జోస్న, శాస్త్రవేత్త రఫీబాబు, శ్రీరామయ్య పాల్గొన్నారు.



కర్తయ్యకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం కమ్మంపాడు లోని జడ్పీ హైస్కూల్ పీఈటి గొట్టిపాటి కర్తయ్య ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. పల్నాడు బాలోత్సవం ఆధ్వర్యంలో సోమవారం నర్సారావుపేటలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవం లో నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకష్ణదేవరాయులు,ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు పాల్గొని ప్రముఖ జాతీయ కబడ్డీ క్రీడాకారుడు గొట్టిపాటి కర్తయ్య ను సన్మానించి అవార్డును అందజేశారు.ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు కర్తయ్యను అభినందించారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి నులకపేట సమీపంలోని ఎమ్మెల రామయ్య కాలనీ ఫారెస్టు ప్రాంతంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిపిఎం ఎమ్మెల రామయ్య కాలనీ మూడో మహాసభ తీర్మానించింది. సోమవారం శాఖ మహాసభ వేముల రమణ అధ్యక్షతన జరిగింది. కొత్త పింఛన్లు మంజూరు చేయాలని, మంత్రి లోకేష్ హామీ మేరకు ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని మరో తీర్మానం చేశారు. పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, నాయకులు వేముల దుర్గారావు రాజకీయ రిపోర్టు ఇచ్చారు. ఎమ్మెల రామయ్య కాలనీ కార్యదర్శిగా ఎం.నాగమల్లేశ్వరి, సహాయ కార్యదర్శిగా వేముల రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



జెర్రివాగు లిఫ్ట్ ఇరిగేషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

జెర్రివాగు ఎత్తిపోతల పథకాన్ని అందుబాటులోకి తెస్తా : ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి- మాచర్ల

జెర్రివాగు లిఫ్ట ఇరిగేషన్ ఎత్తిపోతల పథకాన్ని తిరిగి రైతులకు అందుబాటులోకి తెస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. వెల్దుర్తి మండల పరిధిలోని రైతులకు సాగు, తాగునీరు అందించే జెర్రివాగు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కేంద్రాన్ని ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. నిర్వహణ సరిగా లేక లిఫ్ట్ ఇరిగేషన్ అటకెక్కిందని, రక్షణ కరువై గత ప్రభుత్వ హయాంలో జెర్రివాగు ప్రాజెక్టుకు సంబంధించి మోటర్లు పలు విద్యుత్ పరికరాలు చోరీకి గురైన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి రైతులు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని అన్నారు. జెర్రివాగు లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి నిర్వహణ వ్యయాన్ని అంచనాలు రూపొందించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. త్వరలోనే రైతులకు లిఫ్ట్ ఇరిగేషన్ అందుబాటులోకి తెచ్చి వెల్దుర్తి మండలం గ్రామాల్లో తాగునీరు, రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్లాంట్ భద్రతపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో అవసరమైనచోట్ల పంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అన్నదాతలను ఆదుకుంటామన్నారు.



మాట్లాడుతున్న కె.ఆదినారాయణ

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- మాచర్ల

సూర్య కిరణాలు భూమిపై నేరుగా పడకుండా అందులో ఉండే అతినీలలోహిత కిరణాలును ఓజోన్ పొర సంగ్రహించి, ప్రాణకోటికి వాటిల్లే ముప్పు నుంచి కాపాడుతోందని, జీవరాశికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జనవిజ్ఞాన వేదిక నాయకులు కె.ఆదినారాయణ అన్నారు. స్థానిక కృష్ణవేణి కాలేజీలో ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ వెంకట్రామయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. ఓజోన్ పొరను పరిరక్షించుకోపోతే మానవాళి పెనుప్రమాదంలో పడుతుందన్నారు. మోటారు వాహనాలు పెరగడం, పరిశ్రమల కాలుష్యం, అధికంగా ఏసీలను వినియోగించడం వల్ల ఓజోన్ పొర రోజురోజుకూ క్షీణిస్తోందని, ఆ పొరకు ఏర్పడిన రంధ్రం కారణంగా కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి ఒక్కరు సాధ్యమైనంతలో కాలుష్య నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జువాలజీ లెక్చరర్ చిన్నదాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీలోనే అత్యధికంగా వేధింపులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట



ఆర్టీసీ కార్మిక సమస్యల పరిష్కారం కోసం 1979 సెప్టెంబర్ 16న సిఐటియు అనుబంధంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఏర్పాటైందని, అప్పటి నుండి ఇప్పటి వరకూ అనేక పోరాటాలు చేస్తోందని గుంటూరు జిల్లా కార్యదర్శి రవిశంకర్ అన్నారు. ఫెడరేషన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద జెండాను ఆయన సోమవారం ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ ఆర్టీసీలో ఉన్నన్ని వేధింపులు మరే ప్రభుత్వం సంస్థలోనూ ఉండవన్నారు. ప్రయాణికులు ఎక్కిన వెంటనే టికెట్ ఇవ్వలేదని, అద్దాలు పగిలాయని, టైర్లు పంచర్లు అయ్యాయని డ్రైవర్ల వద్దనే డబ్బులు వసూలు దారుణమన్నారు. చిన్నచిన్న సమస్యలకు కూడా కేసులు పెట్టి ఏళ్ల తరబడి ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు ఆపటం, రిమూవ్‌లు, సస్పెన్షన్లు లాంటి ఘటనలు ఈ ఒక్క ఆర్టీసీలోనే ఉన్నాయన్నారు. అనేక పోరాటాలతో సాధించుకున్న జీవో 1/2019 సరిగా అమలు కావడం లేదని, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనాన్ని కారణంగా అధికారులు చెబుతున్నారని అన్నారు. ఆర్టీసీ సమస్త విధివిధానాలు మెరుగు పడాలని ఎస్‌డ్ల్యూఎఫ్ మొదటి నుండీ డిమాండ్ చేస్తోందన్నారు. ఆర్టీసీలో ప్రైవేటు బస్సులను ఆపాలని, ప్రయాణికులకు సరిపడా కొత్త బస్సులను కొనాలని, 2012 నుంచి రిక్రూట్మెంట్లు లేవని చెప్పారు. కాలం చెల్లిన బస్సులను ఆపాలన్నారు లక్షలకు లక్షలు కిలోమీటర్లు తిరిగిన బస్సులతో మైలేజీ ఎలా వస్తుందని ప్రశ్నించారు. రూ.ఏడెనిమిది వేలతో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులతో పనులను చేయిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యలపై ఫెడరేషన్ పోరాడుతోందని చెప్పారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జెండావిష్కరణ

అనంతరం స్థానిక పండరీపురంలోని సిఐటియు కార్యాలయంలో ఫెడరేషన్ మహాసభ జరిగింది. జీవీ సుబ్బారావు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పి.వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా వి.యోహాను, ప్రధాన కార్యదర్శిగా టి.ఫణిరాజ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా వి.జి. నాయక్, ఎస్‌కె.జిలాని, వైస్ ప్రెసిడెంట్‌గా బి.ఎన్.రావు, ఎం.విజయశాంతి, పబ్లిసిటీ సెక్రటరీగా టి.రోశయ్య, ట్రెజరర్‌గా జీ.వి.సుబ్బారావు, గ్యారేజ్ సెక్రటరీగా ఎన్.సాంబశివరావు, అసిస్టెంట్ సెక్రటరీగా వి.ఆశీర్వాదం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పేదల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి : సిపిఎం



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

స్థానిక కన్నెగంటి హనుమంతు భవనంలో సిపిఎం 1, 2, శాఖ మహాసభలు సోమవారం నిర్వహించారు. తొలుత సిపిఎం జెండాను సీనియర్ నాయకులు డి.భూలక్ష్మి ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, నాయకులు టి.పెద్దిరాజు మాట్లాడారు. ఒకటవ శాఖ కార్యదర్శిగా తెలకపల్లి శ్రీనివాసరావు, రెండో శాఖ కార్యదర్శిగా బత్తుల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. పట్టణ పరిధిలో నిర్మించిన టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తి చేసి పేదలకు ఇవ్వాలని, పేదల కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, అర్హులైన వారికి పట్టాలివ్వాలని, జానపాడు రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని, పిడుగురాళ్ల పట్టణంలో ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను మహాసభల్లో ఆమోదించారు. సీతారామయ్య, షేక్ బాబు, ఎస్.వెంకటకృష్ణ, సుందర్‌రావు, జి.నాగేశ్వరరావు, షేక్ హుస్సేన్, జి.కొండమ్మ, జి.రమణ, జి.భిక్షాలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్రోసూరు

సిపిఎం క్రోసూరు శాఖ మహాసభ స్థానిక ఆమంచి భవన్‌లో జి.ఎలిశమ్మ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత జెండాను సీనియర్ సభ్యులు షేక్ ముస్తఫా ఎగురవేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడారు. క్రోసూరు బస్టాండ్ సెంటర్లో చిరు వ్యాపారాలు చేసుకునేవారు, వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులు ప్రధానంగా మహిళలు బస్టాండ్ సెంటర్లో ప్రజా మరుగుదొడ్లు లేక తీవ్రమైన ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి కోసం ఆందోళన చేస్తే పోలీసులతో అరెస్టులు చేయిస్తున్నారేగాని నిర్మించడం లేదని విమర్శించారు. గ్రామంలో వెయ్యి కుటుంబాలు నివసిస్తున్న చెరువు పోరంబోకు భూములకు పట్టాలివ్వడం లేదని, 3600 కుటుంబాలు జీవిస్తున్న గ్రామంలో తాగునీటి సౌకర్యం అరకొరగానే ఉందని చెప్పారు. దొడ్లేరు రోడ్డు వైపు నివసిస్తున్న నివాస ప్రాంతాలకు చెరువు కట్టకు మధ్య డ్రెయినేజీ కాల్వను ఏర్పాటు చేయాలన్నారు. ఇంటింటికి కుళాయి పేరుతో సిమెంట్ రోడ్లను పగలగొట్టినా వాటికి మరమ్మతులు చేయలేదన్నారు. దీంతోపాటు క్రోసూరు చెరువు కట్ట, కొండను పర్యాటక ప్రదేశంగా అభివద్ధి చేయాలని కోరారు. ఈ మేరకు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. అనంతరం శాఖ కార్యదర్శిగా చిలక ఏసయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.మల్లీశ్వరి, మండల కార్యదర్శి టి.హనుమంతరావు, అనూష పాల్గొన్నారు.





జీవో 115 రద్దు కోసం నర్సుల నిరసన

ప్రజాశక్తి-ఈపూరు

వైద్యారోగ్యశాఖలో ఏళ్ల తరబడి స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్న తమకు జీవో నెంబర్ 115తో తీవ్ర నష్టం వాటిల్లుతుందని సిహెచ్‌సి స్టాఫ్ నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రమైన ఈపూరు సిహెచ్‌సి ఎదుట సోమవారం నిరసన ప్రదర్శన చేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఏళ్ల తరబడి చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎఎన్‌ఎం లను జిఎన్‌ఎమ్ శిక్షణ ఇచ్చి వారిచే వైద్యం చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జీవో 115ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రెండు ఎరువుల షాపుల లైసెన్స్ రద్దు

ప్రజాశక్తి - వినుకొండ



అధిక ధరలకు ఎరువుల విక్రయిస్తున్న రెండు దుకాణాల లైసెన్స్‌ను రద్దు చేశామని వినుకొండ ఎడిఎ బి.రవిబాబు సోమవారం తెలిపారు. చీకటిగలపాలేనికి చెందిన రైతులకు యూరియా, డిఎపిని ఎంఆర్‌పికి మించి ఫిర్యాదు చేయడంతో మండల వ్యవసాయాధికారి కె.అంజిరెడ్డితో కలిసి డిఎ వైష్ణవి ట్రేడర్స్, బెల్లం శివ అగ్రిమాల దుకాణాలను తనిఖీ చేశారు. రెండు షాపుల్లో రూ.57.48 లక్షల విలువ చేసే 319.50 మెట్రిక్ మెట్రిక్ టన్నుల ఎరువులును స్వాధీనం చేసుకున్నారు.

క్రీడా పోటీల్లో ఉత్సాహంగా ఉపాధ్యాయులు



ప్రజాశక్తి - వినుకొండ

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఉపాధ్యాయులకు వినుకొండ నియోజకవర్గం స్థాయి క్రీడా సంబరాలను స్థానిక గుడ్ షెపర్డ్ స్కూల్, పెన్షనర్స్ హాల్లో ఆది, సోమవారాల్లో నిర్వహించారు. పోటీలను యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌కుమార్ ప్రారంభించగా జిల్లా కార్యదర్శి ఎం.రవిబాబు మాట్లాడారు. షటిల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్, క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా నిడమనూరి వెంకటరత్నం, చంద్రశేఖర్ వ్యవహరించారు. బ్యాడ్మింటన్ సింగిల్స్ విజేతగా పి.లక్ష్మనాయక్, డబుల్స్ విజేతలుగా వెంకట్రావు, లక్ష్మనాయక్ నిలిచారు. క్రికెట్‌లో పి.సురేష్ టీం, కబడ్డీలో





వి.పాపారావు టీం, చెస్‌లో డి.కోటేశ్వరరావు, క్యారమ్స్‌లో ఎస్.సుందర్రావు, డి.రవికుమార్, రమేష్ గెలుపొందారు. విజేతలకు డాక్టర్ ఇన్నారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. నియోజకవర్గ స్థాయి విజేతలను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్.అజయ్ కుమార్, జిలాని, వెంకటేశ్వర్లు, డి.రవికుమార్, కె.శ్రీనివాసరాజు, పి.రమేష్, ప్రసాద్, మల్లికార్జునరావు, మస్తాన్, జి.నాగేంద్రుడు, సాంబశివరావు పాల్గొన్నారు.

దారంతా గుంతల మయం

వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్న రహదార్లు - గ్రామీణ ప్రాంతాల పరిస్థితి మరీ దయనీయం

ప్రజాశక్తి-తెనాలి

అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు ..దానికి భారీ వర్షాలు తోడు కావటంతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎక్కడ పడితే అక్కడ ఉన్న గుంతలు మరింత పెద్దవ-య్యాయి. దీంతో రోడ్లు ప్రమాధ:రితంగా తయార య్యాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు ఏ ఒక్కటి కూడా సజావుగా వెళ్లే పరిస్థితి లేదు. నందివెలుగు నుంచి గుంటూరు వెళ్ళే మార్గంలో దెబ్బతిన్న రోడ్డు పరిస్థితి ఇలా ఉంది.

తెనాలి నుంచి నందివెలుగు మీదుగా గుంటూరు వెళ్ళే రోడ్డు ప్రమాధభరితంగా ఉంది. గత ప్రభుత్వ ఐదేళ్ళ కాలంలో రోడ్ల నిర్మాణం, మరమ్మతులపై తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రధర్శించటంతో పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. పట్టణం నుంచి గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లు మరింత ప్రమాదకరంగా తయారయ్యాయి. దీనికి తోడు కొద్ది రోజుల క్రితం వారం పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై నీరు నిలిచి పోవటం, వర్షపు నీటిలోనే వాహనాల రాకపోకలు కొనసాగటంతో దెబ్బ తిన్న రోడ్ల పరస్థితి మరింత దిగజారింది. తెనాలి ఆర్‌అండ్‌బి పరిధిలో నందివెలుగు మొదలు జాకీర్‌హుస్సేన్ నగర్ వరకు పరిశీలిస్తే కొలకలూరు ఫ్లైఓవర్ వద్ద, కొమ్మమూరు కెనాల్ వంతెనపై, జూబ్లీ హైస్కూల్ ఎదురు, పాత సినిమాహాల్ సెంటర్, మంచినీటి బావి సెంటర్, కొలకలూరు ప్రధాన కూడలి, ఖాజీపేట-హాఫ్‌పేట మధ్య తంగెళ్ళమూడి అడ్డరోడ్లు వద్ద, హాఫ్‌పేటలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆర్‌అండ్‌బి తెనాలి పరిధిలో జాకీర్ హుస్సేన్ నగర్ నుంచి నందివెలుగు వరకూ అంటూ దాదాగా ఎనిమిది కిలోమీటర్ల మేర రోడ్డు దుర్భరంగా ఉంది. వాహన చోదకులు ఏమరపాటుగా ఉంటే అంతే సంగతులు. ఈ రోడ్డులో నిత్యం తిరిగే వారికి కొంత రోడ్డు అవగాహన ఉంటుంది. కాని కొత్తవారు ఈ రోడ్లులో ప్రయాణించటం ప్రాణాలతో చెలగాటమే.



హాఫ్‌పేటలో దెబ్బతిన్న రోడ్డు



కొలకలూరు మంచినీటి బావి సెంటర్‌లో రోడ్డు దుస్థితి

దీర్ఘకాలికంగా రోడ్లకు మరమ్మతులు శూన్యం

తెనాలి ఆర్‌అండ్‌బి పరిధిలో రోడ్లు చిత్రమౌతున్నా ఏ మాత్రం పట్టించుకునే పరిస్థితి లేదు. గత ప్రభుత్వం ఐదేళ్ళ కాలంలో రోడ్లు కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. పైగా నందివెలుగు-గుంటూరు రోడ్డుకు నిధులు దాదాపు రూ.3కోట్లకు పైగా మంజూరైనా అది కూడా చేయించ లేకపోయారు. అదేమంటే కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదని అధికారులు చెప్పుకొచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో అధ్వాన్నంగా రోడ్లు మరింత దయనీయంగా తయారయ్యాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తంగెళ్ళ మూడి అడ్డరోడ్డు వద్ద రోడ్డుపై గుంతలు

ఓజోన్ పొర పరిరక్షణతోనే జీవరాసుల మనుగడ

ప్రజాశక్తి-గుంటూరు

సమస్థ జీవరాసుల మనుగడకు ఓజోన్ పొరను కాపాడుకోవటం అత్యంత అవసరం అని ప్రజ్ఞ విద్యాసంస్థల కార్యదర్శి నాయుడు చక్రనాగ్ అన్నారు. స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓజోన్ పొర కాపాడు కోలేకపోతే జరిగే నష్టాలపై విద్యార్థులకు వక్తత పోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులే తయారుచేసిన అనేక నమూనాలను చార్టుల ద్వారా ప్రదర్శించారు. చక్రనాగ్ మాట్లా డుతూ పారిశ్రామికీకరణ నేపథ్యంలో పరిశ్రమల నుండి వెలువడే ఉద్గారాల వల్ల ఓజోన్‌కు నష్టం వాటిల్లుతున్నదని, దీంతో సూర్య కిరణాలు నేరుగా భూమికి తాకి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్నదని తెలియజేశారు. కావున ప్రతి ఒక్కరూ ఓజోన్ పొర పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు జోజమ్మ, విజయ కుమారి, జరీన పాల్గొన్నారు.



కోడెలకు ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు వర్ధంతి కార్యక్రమం సోమవారం జిల్లా టిడిపికార్యాలయంలో నిర్వహించారు. జిల్లా టిడిపి అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ హాజరై కోడెల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా టిడిపి అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ నిస్వార్థంగా ఎంతో మంది ప్రజలకు సేవలు అందించిన గొప్పనాయ కులు కోడెల శివప్రసాద్ గారు. ఏ రంగంలో పని చేసినా పేదలకు సేవ చేసే లక్ష్యంతోనే పని చేశారని అన్నారు. కోడెల శివప్రసాదరావు మంచి మనసున్న డాక్టర్ అని ఎంతో మంది పేదలకు అతి తక్కువ ఖర్చుకు వైద్య సేవలు అందించా రన్నారు. తనకు కేటాయించిన మంత్రిత్వ శాఖలలో నూతన సంస్కరణ తీసుకువచ్చి తాను నిర్వహించిన మంత్రి పదవులకు వన్నె తెచ్చారన్నారు. పల్నాడు ప్రాంతం నుంచి రాష్ట్ర స్థాయికి ఎదిగారని... పల్నాడు ప్రాంత ప్రజలలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. టిడిపికి బలమైన నిబద్ధత కలిగిన నేత కోడెల వైసిపి ప్రభుత్వ వేదింపులకు కోడెల బలైయ్యాడని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి రాజామాస్టారు, కంచర్ల శివరామయ్య, నాయుడు ఓంకార్, వేములకొండ శ్రీనివాస్, షేక్ చిన్న బాజీ, కోసూరి సతీష్ గౌడ్, వడ్డే శ్రీనివాసరావు, పాటిబండ్ల బలరాం తదితరులు పాల్గొన్నారు.



కోడెల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెనాలి శ్రావణ్‌కుమార్ తదితరులు

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం

ప్రజాశక్తి-తాడేపల్లి

మహ్మద్ ప్రవర్త బోధనలు అనుసరణీయమని తాడేపల్లి ఒకటో వార్డులోని జామియా మసీద్ పెద్దలు తెలిపారు. మిలాద్ ఉన్ నబి సందర్భంగా తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లో స్థానిక యువకుతలో కల్చరల్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలు మాట్లాడుతూ ఇస్లాం అనేది శాంతికి చిహ్నమని చెప్పారు. మనుషులను ధర్మం వైపు నడిపించడానికి దోహదపడుతుందని చెప్పారు. ఆయన సూక్తులను మననం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షులు ఎండి షఫియుల్లా భేగ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రగతినగర్ అభివృద్ధికి దావీదు విశేష కృషి

సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్

పత్రా దావీదుకు నివాళులర్పించిన సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - గుంటూరు

సిపిఎం సభ్యుడు పత్రా దావీదు మరణం ప్రగతి నగర్‌కు తీరనిలోటు అని, ఆయన ఆశయాలను, లక్ష్యాలను కొనసాగించాలని సిపియం నగర కార్యదర్శి కే.నళినికాంత్ అన్నారు. సోమవారం ప్రగతి నగర్లో దావీదు సంస్మరణ సభ కే. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగినది. తొలుత దావీదు చిత్రపటానికి ఎస్.కె గని పూలమాలవేసి నివాళు లర్పించారు .ఈ సందర్భంగ నళినీ కాంత్ మాట్లాడుతూ ప్రగతి నగర్ ఏర్పాటు, ఆ తర్వాత కాలనీ సమస్యల మీద, పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను జయప్రదం చేయడానికి ఎంతోకృషి చేశారన్నారు. తాను చివరిదాకా తన నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నారని, ఆయన మరణం ప్రగతి నగర్ వాసులకు , పార్టీకి లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో బి .ముత్యాలరావు, మరియదాసు తదితరులు దావీదుతో వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాఖ సభ్యులు ఫాతిమా, రాగి వెంకటేశ్వరరావు, జి బాబు, కే నాగలక్ష్మి,ఓబులేస్వరి, కుటుంబ సభ్యులు ఫ్రాన్సిస్, జోజి, సాగర్ బాబు, తేరేజమ్మ, అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు



దావీదు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, ప్రజలు



మాట్లాడుతున్న పాశం రామారావు

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి రూరల్ గ్రామాల్లో ఇటీవల వచ్చిన వరదల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి రూరల్ కమిటీ సమావేశం బొప్పన గోపాలరావు అధ్యక్షతన తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ఎన్యుమరేషన్ వెంటనే పూర్తి చేసి నష్టపోయిన కంద, పసుపు, అరటి తదితర పంటలకు ఎకరానికి రూ.50 వేలు, వరికి రూ.30 వేలు ఇవ్వాలని కోరారు. పశుసంపద అధికంగా ఉన్న చిర్రావూరు గ్రామంలో ఇటీవల వచ్చిన వరదల వల్ల కృష్ణానది లంకల్లోకి వెళ్లడానికి వీల్లేని పరిస్థితులు ఏర్పడటంతో మేత సమస్య పశువుల యజమానులకు ఇబ్బందికరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వేరే ప్రాంతంలో మేత కొనుగోలు చేసి రైతులకు అందించి అక్కడ పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. వరద వచ్చి వారం రోజులైనా నేటికీ లోతట్టు గ్రామాల్లో నీళ్లు నిలబడి ఉన్నాయని, దీని వల్ల అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిల్వ నీటిని బయటకు పంపించాలని, బ్లీచింగ్, పెనాయిల్ చెల్లించాలని కోరారు. క్లోరినేషన్ చేసిన మంచినీరు అన్ని గ్రామాలకు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, విజయరాజు, ఎన్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వై నేతాజీ, శివాజి తదితరులు

ఏచూరి ఆశయాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - పెదకాకాని

సిపిఎం జాతీయ నేత సీతారాం ఏచూరికి సిపిఎం పెదకాకాని మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. పెదకాకానిలో నిర్వహించిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై నేతాజీ ప్రసంగించారు . రాజ్యసభ సభ్యునిగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి మతోన్మాద శక్తులను దాని ప్రమాదాన్ని ఎండగట్టడంలో సీతారాం ఏచూరి ఎనలేని కృషి చేశారన్నారు. విద్యార్థి నాయకునిగా, ఎస్ఎఫ్ఐ జాతీయ కార్యదర్శిగా దీర్ఘకాలం కృషి చేశారని, ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షునిగా దేశవ్యాప్త విద్యార్థి సమస్యలపైన నూతన విద్యావిధానం కావాలని, ప్రత్యామ్నాయ విద్యావిధానం వుండాలని ప్రభుత్వానికి అనేక సూచనలు చేశారని చెప్పారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో, పార్టీని విస్తరించడంలో సీతారాం ఏచూరి ఎనలేని కృషి చేశారని అన్నారు. ఎన్ శివాజి మాట్లాడుతు బిజెపి ప్రమాదానికి వ్యతిరేకంగా, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా 'ఇండియా' వేదిక నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని, ఆయన మరణం దేశ లౌకిక అభ్యుదయ శక్తులకు తీరని లోటన్నారు. కడ వరకు తను నమ్మిన సిద్ధాంతం కొరకు పని చేశారని సీతారాం ఏచూరి చనిపోవడం చాలా బాధాకరం అని ఆయన ఆశయాలను ముందుకు తీసుకు పోవడమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళులని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం శ్రీనివాసరావు, కే సత్యనారాయణ, నరిశెట్టి నాగరత్నం బి బాబురావు బి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మాచర్ల జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు షేక్ ఆయిషా సుల్తానాను నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అరవింద్‌బాబులు ఘనంగా సత్కరించారు. పల్నాడు బాలోత్సవంలో భాగంగా సోమవారం నరసరావుపేట ప్యారడైజ్ ఫంక్షన్ హాల్లో పల్నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు గ్రహీతల అభినందన సభ నిర్వహించారు. జనసేన నాయకులు జిలాని పాల్గొని ఆయిషా సుల్తానాను సన్మానించారు. ఎంఎస్‌ఆర్ కె.ప్రసాద్, రామరాజు, అట్లూరి శాంతి పాల్గొన్నారు.

50 కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - మాచర్ల

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వగ్రామం కండ్లకుంటలోని 50బీసీ కుటుంబాలు శ్రీకాంత్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నుండి టిడిపిలో చేరారు. మండలకేంద్రమైన వెల్దుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వీరు చేరికతో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లికి ఎదురుదెబ్బ అని చెప్పవచ్చు. కండ్లకుంట గ్రామంలో కనీసం ఇంత వరకు వేరే పార్టీల జండా దిమ్మె కనిపించదు. రాజకీయంగా పూర్తిగా ఒకవైపున నిలబడే గ్రామంలో చీలిక వచ్చే పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రతిఒక్కరితో కలిసి పనిచేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పగలు ప్రతీకారాలకు దూరంగా నియోజకవర్గంలోని గ్రామాల ప్రజల గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో మార్పు హర్షణీయం

ప్రజాశక్తి- మాచర్ల

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇక నుండి ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండేలా మార్పు చేయాలని సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలపై మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం యాగంటి మల్లికార్జునరావు విలేఖరులతో మాట్లాడుతూ ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రత్యేక కుర్చీ, రెడ్ క్లాత్‌తో కూడిన పోడియం కలిగి రాజరిక వ్యవస్థను తలపించేలా ఉన్నాయన్నారు. ప్రభుత్వ సేవలను ప్రతిఒక్కరికీ సులుభతరం చేసేందుకు కొత్త సంస్కరణలను తీసుకురావడం శుభ పరిణామమని అది విజన్ ఉన్న నాయకుడైన సీఎం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జెడ్‌పి స్కూల్ విద్యార్థి

ప్రజాశక్తి - కారంపూడి

జాతీయ స్థాయి ఖో, ఖో పోటీలకు కారంపూడి బ్రాహ్మానాయుడు జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి రెయిన్‌పాల్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంత శివ సోమవారం తెలిపారు. బాపట్ల జిల్లా జె.పంగులూరులో ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ ఖోఖో బాల బాలికల రాష్ట్ర జట్ల ఎంపికలు జరిగాయి. ఇందులో తమ విద్యార్థి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన రెయిన్ పాల్ ఈనెల 16వ తేదీ నుండి 26 వ తేదీ వరకు బాపట్ల జిల్లా జె పంగులూరు లో శిక్షణ పొంది అనంతరం సెప్టెంబర్ 28 నుండి అక్టోబర్ 2వరకు జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖో ఖో పోటీల్లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు స్వర్ణరాజు, శ్రీనివాసరావులు తెలియజేశారు. రెయిన్‌పాల్‌కు పాఠశాల విద్యాకమిటి చైర్మన్ బాలునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

తాగిపడేసిన కొబ్బరిబొండాం వల్ల జ్వరాలు

జ్వరాలతో కెసిపి, సొసైటీ ప్రజలు
కాలనీల పక్కనే పడేస్తున్న వ్యాపారస్తులు

ప్రజాశక్తి- మాచర్ల

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంటలు, కాలువల్లో, దోమలు వృద్ధి చెందడం మాములే అయితే తాగి పడేసిన కొబ్బరిబొండాల్లో దోమలు వృద్ధి చెందడాన్ని ఎప్పుడైనా చూశారా?. పోనీ విన్నారా? ఇది నిజమని మాచర్ల పట్టణంలో జ్వరపీడితులు చెప్పకనే చెబుతున్నారు. దోమల వృద్ధి వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు వంటి అనేక రోగాలు వస్తాయని మనకు తెలుసు. తెలిసినా జ్వరాలకు గురవ్వక తప్పదు. ఎందుకంటే స్థానిక నాయకులు, అధికారులు పట్టించుకోకపోతే జ్వరాలేంటి వింత వ్యాధులూ వచ్చే అవకాశం ఉంది.



రోడ్డు వైపు కుప్పగా పడేసి ఉన్న కొబ్బరిబొండాలు

పట్టణంలోని కొందరు కొబ్బరి బొండాల వ్యాపారస్తులు తాగేసి పడేసిన కొబ్బరి బొండాలను స్థానిక కెసిపి, సొసైటీ కాలనీల పక్కన డంపింగ్ యార్డుకు వెళ్ళే దారి వెంబటి పడవేస్తున్నారు. ఈ కాలనీలకు రెండు కిలోమీటర్లు దూరంగా ఉండే డంపింగ్ యార్డులో పడవేయాల్సిన కొబ్బరిబోండాలను కాలనీల పక్కనే పడేస్తుండం వల్ల దోమల వ్యాప్తి పెరుగుతున్నాయి. ముఖ్యంగా తాగి పారేసిన కొబ్బరి బొండాలలో ఈడిన్‌ఈజిప్ట్ అనే దోమ పెరుగుతుంది. ఈ దోమ కుట్టడం కారణంగా డెంగీ సోకుతుంది. మంచినీటిలో వృద్ధి చెందే ఈ దోమ మూతలు లేని నీళ్ల ట్యాంకులు, సిమెంట్, తారు రోడ్డుపై నిలిచే వర్షపు నీటిలో, వాడిపడేసిన ప్లాస్టిక్ వస్తువుల్లో, ఇంట్లో ఉండే పూల కుండీల్లో, కూలర్లు, పాత టైర్లలో ఎక్కువగా వృద్ధి చెందుతాయి. అంతేకాదు తాగిపడేసిన కొబ్బరిబొండంలోనూ దోమలు వృద్ధి చెందుతారు. వ్యాపారస్తుల నిర్లక్ష్యం వల్ల కాలనీవాసులు జ్వరాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలన్నారు. ఈ పరిస్థితికి కారకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వరికపూడిశాల ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలి

ప్రజాశక్తి - వినుకొండ

వరికపూడిశాల ప్రాజెక్టును ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని నాయకులు డిమాండు చేశారు. సోమవారం సిపిఎం కార్యాలయంలో నాయకులు విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. వెల్దుర్తి మండలంలో ప్రాజెక్టు కోసం సకాలంలో నిధులు విడుదల చెయ్యక వైసిపి ప్రభుత్వం డ్రామాలు ఆడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి 18వ తేదీ నుండి జరగబోయే మంత్రిమండలి సమావేశంలోనైనా నిధులు కేటాయించేలా ఎజెండాలో చేర్చాలని డిమాండు చేశారు. ప్రాజెక్టుకు రూ.1600కోట్లు కేటాయించాలని కోరినా విస్మరించారని ఈ మంత్రి మండలిలోనైనా పట్టించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శ



మాట్లాడుతున్న నాయకులు

మారుతి వరప్రసాద్, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కె హనుమంత రెడ్డి, సిపిఎం పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పిడుగు విజయ్, ఆమ్ ఆద్మీ పార్టీ రూబెన్ పాల్గొన్నారు.

నియోజకవర్గాల అభివృద్ధిలో 'కోడెల' ముద్ర చెరగనిది

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గం మాజీ మంత్రి నవ్యాంధ్ర తొలి సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు ముద్ర ఎప్పటికీ జరగలేదని దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కడియాల అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో సోమవారం దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు 5వ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ మాట్లాడుతూ పల్నాడు అభివద్ధి స్ఫూర్తి ప్రదాత డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రజల హృదాయాల్లో చిరస్మరణీయుడన్నారు. అదేవిధంగా గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో నాయకులతో కలిసి కోడెల వర్థంతి వేడుకలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సరఫరాలు, పంచాయితీ రాజ్, ఆరోగ్య శాఖ, ఇరిగేషన్ వంటి ప్రతిష్ఠాత్మకమైన మంత్రిత్వ శాఖలను సమర్థవంతంగా నిర్వహించాడని ఎమ్మెల్యేడాక్టర్ చదలవాడ కొనియాడారు. కోటప్పకొండ అభివృద్ధిలో సైతం కోడెల ముద్ర తరతరాలుగా నిలిచి ఉంటుందన్నారు. ప్రజా వైద్యునిగా, ప్రజాపతినిధిగా సుధీర్ఘమైన చరిత్రగల రాజకీయ నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వేములపల్లి వెంకట నరసయ్య, కపలవాయి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీ

ప్రజాశక్తి-గుంటూరు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మాజీ పార్లమెంట్ సభ్యులు జివి.హర్షకుమార్ అన్నారు. సోమవారం స్థానిక బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో 'హలో మాల-చలో గుంటూరు' పేరుతో నిర్వహించిన సదస్సులో హర్షకుమార్ మాట్లాడుతూ దేశంలో ఏపీ, తెలంగాణ, కర్నాటక తప్ప అన్ని రాష్ట్రాల్లోనూ మాలలతోపాటు, మాదిగలూ ఈ విధమైన వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. క్రిమిలేయర్ అమలు చేయటం వల్ల సివిల్ సర్వీస్ అధికారులతోపాటు 4వ తరగతి ఉద్యోగుల కుటుంబాలలోనూ వారి పిల్లలకు రిజర్వేషన్లు ఉండవన్నారు. ఈ నేపథ్యంలో వర్గీకరణకు వ్యతిరేకంగా నూతన పార్టీ ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వర్గీకరణ వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ఉప్పులేటి దేవీప్రసాద్ మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు అందరూ ఐక్యం కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయ, మద్దు అంకయ్య, తమనంపల్లి అమృతరాజ్, చిన్నం పరంజ్యోతి, పల్లి శ్యామ్‌ప్రసాద్, దొడ్డా రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

'బదర్' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మతసామరస్యం, హిందూ - ముస్లిం సమైక్యత, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా కరిముల్లా కవిత్వం ధ్వజమెత్తిందని అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షులు పాషావలి అన్నారు. మాచర్ల పట్టణానికి చెందిన అబ్దుల్ కలాం సేవా సమితి కార్యాలయంలో సోమవారం వినుకొండకు చెందిన ప్రసిద్ధి కవి కరిముల్లా రచించిన బదర్ పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాషావలి మాట్లాడుతూ కరిముల్లా కవిత్వం సమాజంలో ప్రేమను, శాంతిని నింపుతూ వివిధ వర్గాల మధ్య వారధిలా నిలుస్తోందన్నారు. ఇప్పటి వరకు 26 పుస్తకాలు రచించారని, ప్రస్తుతం 15 పుస్తకాలు ప్రచురణమయ్యాయని, పలు యూనివర్సిటీలు ఆయన కవిత్వంపై పరిశోధనలు సాగించాయని తెలిపారు. అనంతరం ప్రముఖ కవి కరిముల్లాను ముస్లిం మైనారిటీ నాయకులు కౌన్సిలర్ మదర్ సాహెబ్, జలీల్, రిటైర్డు డిప్యూటీ డిఈఓ గాదె రామకష్ణారావులు ఘనంగా సత్కరించారు.

నేటి నుండి 'స్వచ్ఛతా హి సేవ-2024' ప్రారంభం

ప్రజాశక్తి - వినుకొండ



స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛంద కార్పొరేషన్ రూపొందించి అమలు చేస్తున్న 'స్వభావ స్వచ్ఛత-సంస్కార స్వచ్ఛత' అన్న నినాదంతో స్వచ్ఛతాహి సేవ-2024 కార్యక్రమాన్ని 15 రోజులపాటు పట్టణంలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వినుకొండ పురపాలక సంఘం కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఈ నెల 17న మానవహారం, సామూహిక స్వచ్ఛత కార్యక్రమం ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. ఎస్‌హెచ్ఎస్-2024 సంబంధించి రోజువారి కార్యక్రమాలను రూపొందించామన్నారు. 17న గవర్నమెంట్ జూనియర్ కాలేజిలో ఎమ్మెల్యే, చైర్మన్ దస్తగిరి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అక్కడ మానవహారంగా ఏర్పడి సామూహిక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అలాగే అక్టోబర్ ఒకటో తేదీ వరకు దోమల వృద్ధి కేంద్రాల ప్రక్షాళన, 'స్వచ్ఛత వాక్', ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్, పారిశుధ్య కార్మికులను గుర్తింపు, వారి కుటుంబాలకు ఆరోగ్య పరీక్షలు, 'ఏక్ పేడ్ మా కీ నామ్' నినాదంతో మొక్కలు నాటడం, 'మిషన్ లైఫ్ క్యాంపెయిన్, కాల్వల్లో పూడికతీత, రహదారుల పరిశుభ్రత, రోగ నివారణ టీకా వేయడం, మరికొన్నింటిపై అవగాహనకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలన్నింటికీ ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థలు పాల్గొనాలని కోరారు.

ప్రజాశక్తి - కారంపూడి : కారంపూడి మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలలో సెప్టెంబర్ 17వ తేదీ నుండి రెండవ తేదీ వరకు స్వచ్ఛతాహి సేవ 2024 పక్షోత్సవాలు నిర్వహిస్తారని మండల అభివద్ధి అధికారి తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో ప్రతిరోజూ ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం ఈవెంట్లు నిర్వహించాలని, ఈ ఈవెంట్లలో చెరో మూడు టీమ్‌లలో జరుగుతాయని మొదటిది స్వచ్ఛతాహి జన్భాగీదారి, రెండవది సంపూర్ణ స్వచ్ఛత, మూడవది సఫాయి మిత్రా షేవింగ్ ఒకటవ తారీఖు వరకు నిర్వహిస్తారని, గాంధీ జయంతి రోజు స్వచ్ఛభారత్ దివాస్‌గా పరిగణించి అన్ని గ్రామ పంచాయతీలోని ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ల దగ్గర గ్రామ సభలు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారని ఎంపిడిఓ తెలిపారు. అదేవిధంగా వివో పిఆర్‌డి స్వచ్ఛభారత్ ఎంసిఓ పర్యవేక్షణ చేస్తారని తెలియజేశారు.

శిథిలమైపోతోంది.. అగ్నిమాపకకేంద్రం..!

- కొత్త భవనానికి మోక్షమెప్పుడో.?
- కూలటానికి సిద్ధంగా ఉన్న పాత ఫైర్ స్టేషన్



శిథిలావస్తకు చేరిన ఫైర్‌స్టేషన్

తప్పు పట్టిన ఫైర్‌ఇంజన్

ప్రజాశక్తి - పొన్నూరు

ప్రమాదం.. ప్రమాదం.. అగ్నిప్రమాదం.. ఇది వింటే ఒక్కక్షణం కళ్లార్పకుండా బిగ్గరగా చూస్తారు. ఎందుకంటే దాని తీవ్రత అలాంటిది గనుక. రోడ్డు ప్రమాదాన్ని చూసుంటారు.. ప్రకృతి ప్రమాదాలను చూసుంటారు.. కానీ అగ్ని ప్రమాదం సంభవిస్తే ఆహుతికి బూడిద రాలడమే ఉంటుంది. అలాంటి అగ్నిప్రమాదాలను కట్టడి చేసేందుకు ఏర్పాటు చేసుకున్నదే అగ్నిమాపకకేంద్ర భవనం. ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగితే వెంటనే అతి తక్కువ సమయంలోనే ఫైర్ ఇంజన్‌ని సిద్ధం చేసి ప్రమాదాన్ని తగ్గించే ప్రయత్నం వెనువెంటనే చేస్తుంది. అయితే అవన్నీ జరగాలంటే అగ్నిప్రమాదకేంద్ర భవనం, సిబ్బంది తక్షణం స్పందించాల్సి ఉంటుంది. అలాంటి అగ్నిమాపకకేంద్రం పొన్నూరులో శిథిలావస్తకు చేరుకుంది. కొత్త భవనం ఊపిరిపోసుకోవాలన్నా నిధుల లేమి అడ్డగిస్తోంది.

కొత్త భవనానికి మోక్షమెప్పుడో.?

పొన్నూరులో కొన్నేళ్ల కిందట నూతన ప్రాంతీయ అగ్నిమాపకకేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిధుల కొరత వల్ల అర్ధాంతరంగా ఆగిపోయింది. గత ప్రభుత్వ హయాంలో ఈ భవన నిర్మాణానికి అప్పటి ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోకపోవడంతో అగ్నిమాపక భవన నిర్మాణం పూర్తి కాలేదు. సుమారు రూ.75 లక్షలతో హోంశాఖ హౌసింగ్ బోర్డు ఇంజనీరింగ్ అధికారులు అగ్నిమాపక భవన నిర్మాణం పనులు ప్రారంభించారు. నిధుల లేమితో మూడేళ్ల కిందట ఈ భవన నిర్మాణం ఆగిపోయింది. ఇప్పటికి 75 శాతం మేర నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిగిలిన 25 శాతం పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఫ్లోరింగు టైల్స్, ఎలక్ట్రికల్ పనులు, తలుపులు కిటికీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ భవనానికి మెరక పనులు చేపట్టాల్సి ఉంది.

భవన నిర్మాణంలో అలసత్వం

ఈ విషయాన్ని స్థానిక శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దృష్టికి పొన్నూరు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ప్రసాదరావు, సిబ్బంది తీసుకువెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత హోంశాఖ హౌసింగ్ బోర్డ్ ఇంజనీరింగ్ అధికారులను సంప్రదించారు. మిగిలిన అగ్నిమాపక కేంద్ర భవన నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు 15వ ఆర్థిక ప్రణాళిక సంఘం నిధులతో అంచనాలు తయారు చేసినట్లు అధికారులు చెప్పారని ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ప్రసాదరావు తెలియజేశారు.

కూలటానికి సిద్ధంగా ఉన్న పాత ఫైర్ స్టేషన్..

మాజీ రెవెన్యూ శాఖామంత్రి దివంగత ధూళిపాళ్ల వీరయ్య చౌదరి హయాంలో 1986లో పొన్నూరు ప్రాంతీయ అగ్నిమాపక కేంద్ర భవనం నిర్మించారు. ఈ భవనాన్ని అప్పటి హోంశాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు ప్రారంభించారు. 39 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ అగ్నిమాపక భవనం పూర్తిగా శిథిలమై నేల కూలటానికి సిద్ధంగా ఉంది. ఈ భవనం స్లాబ్ పూర్తిగా దెబ్బతిని పెచ్చులూడుతున్నాయి. గోడలు బీటలువారీ పూర్తిగా దెబ్బతిన్నాయి. కింద ఫ్లోరింగ్ పాడైపోయింది. విద్యుత్ తీగలు, బోర్డులు ఎక్కడికక్కడ పగిలిపోయాయి. ఈ అగ్నిమాపక భవన స్థలం పల్లంగా ఉండటంతో కొద్దిపాటి వర్షానికి ఈ ప్రాంగణమంతా చెరువుగా మారిపోతుంది. పూర్తిగా దెబ్బతిన్న పాత అగ్నిమాపక భవనంలోనే సిబ్బంది భయం, భయంతో విధులు నిర్వహిస్తున్నారు. ఈ అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసిన సమయంలో ప్రారంభించిన ఫైర్ ఇంజన్ పూర్తిగా శిథిలమైంది. గత కొన్ని సంవత్సరాలుగా వర్షానికి తడిసి, ఎండకు ఎండుతూ తుప్పు పట్టి శిథిలమైంది. ప్రభుత్వ అధికారులు దీనిని ఆక్షన్ ద్వారా వేలం వేయాలని నిర్ణయించి ఎంతో కాలమైంది. అయినప్పటికీ ఇప్పటివరకు తుప్పు పట్టి కునారిల్లుతుంది. సంబంధిత జిల్లా ఫైర్ స్టేషన్ అధికారులు చర్యలు తీసుకొని మధ్యలో ఆగిపోయిన అగ్నిమాపక కేంద్ర భవనం నిర్మాణం పనులు ప్రారంభించి, పూర్తి చేయాలని స్థానిక పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



ఘనంగా గణేష్ నవరాత్రులు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఉండవల్లి సెంటర్ లో శ్రీ గణేష్ యూత్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రుల ఉత్సవాలు తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి తొమ్మిదో రోజైన శనివారం శ్రీగణేష్ యూత్ ఉత్సవ కమిటీ సభ్యులు 134 రకాల ప్రసాదాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గణేష్ నవరాత్రులు సందర్భంగా ఈ ఏడాది మట్టి గణపతి ఏర్పాటు చేశామని, అందులో భాగంగా ప్రజలందరికీ దర్శన భాగ్యం కల్పించాలనే ఉద్దేశంతో 15 రోజులు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, తొమ్మిదో రోజైన సోమవారం 134 రకాల ప్రసాదాలు ఏర్పాటు చేసి భక్తులకు అందించామని తెలిపారు.

ప్రజాశక్తి - మంగళగిరి: మంగళగిరి ఇందిరానగర్ మున్సిపల్ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం ఐదో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం సుమారు 1500 మందికి అన్నదానం చేశారు. దీనిని ఆరుద్ర సుబ్బారావు, కోగంటి బాబి, మాదాల వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, టీడీపీ నాయకులు చావలి ఉల్లయ్య, బోగి కోటేశ్వరరావు, నల్లగొర్ల శ్రీరామకృష్ణ, బోగి నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.



ఆయుర్వేదంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచలోనే అత్యంత పురాతన వైద్యశాస్త్రం ఆయుర్వేదమని, వ్యాధుల మూలాలను తెలుసుకొని, రోగ ఉపశమనం కన్నా రోగ నివారణకి ప్రాధాన్యత ఇచ్చే ఆయుర్వేదంతో అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆయుర్వేద వైద్యులు డాక్టర్ నాగేంద్ర అన్నారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ అధ్యక్షతన జరిగిన ఆరోగ్యసభలో డాక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ మానవ జాతి ఆవిర్భావం నుండి మానవుడు తన శరీరానికి వస్తున్న అనేక రుగ్మతలకు కారణాలు తెలుసుకోవడానికి ఎన్నో పరిశోధనలు చేశాడని, ప్రకృతిలో లభ్యమవుతున్న అనేక వృక్ష, ఖనిజ రసాయన పదార్థాలను పరిశీలించి పరిశోధించిన ఫలితమే ఆయుర్వేద మందులన్నారు. ఆధునిక వైద్యానికి లొంగని కొన్ని దీర్ఘకాలిక వ్యాధుల్ని, మొండి వ్యాధుల్ని సైతం ఆయుర్వేద వైద్యం ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. ప్రస్తుత ఆయుర్వేదంలో 'పంచకర్మ' అనే పద్ధతి బాగా ప్రసిద్ధి చెంది ఉందని, ఈ విధానంతో కండరాలు, నరాలకు సంబంధించిన అనేక వ్యాధులకు విముక్తి కలుగుతుందన్నారు. సముతుల్య ఆహారం, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి ఆయుర్వేదం వివరిస్తుందని, మానవుని శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సును పరిగణలోకి తీసుకొని ఆయుర్వేద చికిత్సలు చేయబడతాయన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేంద్ర ఆయుర్వేదంపై ఉన్న అపోహల గురించి ఆయుర్వేదం పేరుతో జరుగుతున్న మోసాల గురించి వివరించారు. పెద్దవారిలో వస్తున్న పార్కిన్ సన్, సయాటికాకు 'ఇంటిగ్రేటెడ్' ఆయుర్వేద పద్ధతి మంచిదని తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఆడిటర్ ఎం.భాస్కర్ రెడ్డి, విశ్రాంత ప్రభుత్వ వైద్యులు డాక్టర్ ఎ.రవీంద్రకుమార్, పివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఐపిఎస్ అధికారుల సస్పెన్షన్ సబబే'

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



సినీనటి కాదంబరి జెత్మలానీ వ్యవహారంలో చట్టాన్ని చేతిలోకి తీసుకొని దుర్మార్గంగా వ్యవహరించిన ముగ్గురు ఐపిఎస్ అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేయడం సబబేనని మాజీ మంత్రి డొక్కా మాణిక్య ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం అరండల్ పేటలోని తన కార్యాలయంలో మాణిక్యరావు ప్రసాద్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ముగ్గురు ఐపిఎస్ అధికారులుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాక ప్రభుత్వం ముగ్గురు ఐపిఎస్ అధికారులనూ అరెస్టు చేయాలని డిమాండు చేశారు. ఐపిఎస్ వ్యవస్థే తలదించుకునే పరిస్థితి తీసుకొచ్చారని వ్యాఖ్యానించారు. ఆ ముగ్గురు అధికారులు స్వచ్ఛందంగా తమ ఐపిఎస్‌లకు రాజీనామా చేసి, వాళ్ల చేసిన తప్పులు ఒప్పుకుంటే హుందాగా ఉంటుందన్నారు. వైసిపి నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి వలనే తాము ఈ విధంగా చేశామని చెబితే వారి గౌరవం పెరుగుతుందని సలహా ఇచ్చారు. ఐపిఎస్ అధికారులతో సినీనటి జత్వానిని అరెస్టు చేయించిన సజ్జలను కూడా అరెస్ట్ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఐపిఎస్ అధికారులు రాజకీయనేతలుగా వ్యవహిరించినందున వారిని వైసిపి జిల్లా అధ్యక్షులుగా నియమిస్తే బాగుంటుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కనీసం జగన్ సెక్యూరిటీ అధికారులుగానైనా నియమించుకోవాలని సూచించారు. సికె పార్టీ రాష్ట్ర మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, జనసేన పార్టీ నాయకులు పాలకాయల వెంకట్ పాల్గొన్నారు.

భూములు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-తాడేపల్లి



రాష్ట్ర వ్యాప్తంగా బిసిల భూములు కబ్జా చేసిన వారిపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ బిసి చైతన్య సమితి జాతీయ అధ్యక్షులు బిసి రమణ డిమాండు చేశారు. సోమవారం ఉండవల్లిలోని రాజగృహం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీసీల భూములే అధికంగా కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. అవినీతి అధికారులు కబ్జాదారులకు సహకరించారని ధ్వజమెత్తారు. ఎటువంటి రక్షణ చట్టాలు లేనందు వల్ల బీసీ భూములు అన్యాక్రాంతమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో జాతీయ బీసీ చైతన్య సమితి ఆధ్వర్యంలో ఒక కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజా సంఘాల నాయకులు జె.బాబు, కె.ఏడుకొండలు, కె.వేణుగోపాల్, నాగరాజు, ఎం.రాము, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

భీమ్ భారత్ ఆధ్వర్యంలో బొజ్జా తారకం వర్ధంతి

ప్రజాశక్తి-గుంటూరు

మానవ హక్కుల సాధకుడు బొజ్జా తారకం 8వ వర్ధంతి కార్యక్రమం సోమవారం అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో నిర్వహించారు. బొజ్జాతారకం చిత్రపటానికి వివిధ ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్ మాట్లాడుతూ న్యాయవాదిగా, రచయితగా, కవిగా తనకున్న మేధస్సును దళిత, గిరిజనుల హక్కుల కోసం ఎంతగానో శ్రమించి సాధించిన విప్లవ యోధుడు బొజ్జ తారకం అన్నారు. దళిత మహాసభ అధ్యక్షులుగా ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో కారంచేడు నుండి చుండూరు, ఏంపేట దళితుల హత్యలకు, అవమానాలకు, దాడులకు వ్యతిరేకంగా దళిత బహుజనులను చైతన్యం చేసేందుకు ఎనలేని కృషి చేశారన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచనలను ప్రజలకు చేరువ చేసేందుకు ఎంతో శ్రమించారన్నారు. కార్యక్రమంలో బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కోఆర్డినేటర్ సాదు మాల్యాద్రి, బీసీ మహాజనఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహారావు, డెమోక్రటిక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చాట్ల డేన్నిస్‌రాయ్, దళిత బహుజన ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ సి.సురేష్. ప్రజాపోరు రాష్ట్ర అధ్యక్షులు పాటిబండ్ల కోటేశ్వరావు. న్యాయవాది శ్రీనివాస్, కాశీమాల జోజి. తిరువళ్లూరు హరినాథ్‌బాబు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

చలపతిలో ఎంఎస్ఎంఇ ఐడియా హ్యాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో చలపతి బిజినెస్ ఇంక్యూబేషన్ సెంటర్, గుంటూరు వోల్క్స్ ఫాంటమ్ ఐపి సోలుషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ' ఎంఎస్ఎంఇ ఐడియా హ్యాకథాన్ 4.0 ' ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ వివిధ నూతన వ్యాపారాల స్థాపనకు అవసరమయ్యే కొత్త ఆలోచనలను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. వినూత్న ఆలోచనలు పంపే వారు 18 -35 సంవత్సరములు మధ్య వయస్సు వారై ఉండాలని, విద్యార్థులే కాకుండా ఎవరైనను వినూత్న ఆలోచనలతో ముందుకు రావచ్చునని తెలిపారు. ఈనెల 23వ తేదీలోపు పంపించాలన్నారు. చలపతి ఫార్మసీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో చలపతి ఇంక్యూబేషన్ సెంటర్ 2020లో ప్రారంభం అయ్యిందని, అప్పటి నుండి ఈ సెంటర్ ద్వారా కళాశాలలోని విద్యార్థులందరికీ అనేక అవగాహనా కార్యక్రమాలు, 14 స్కిల్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్స్ నిర్వహించామన్నారు. ఇప్పటి వరకూ 4 పేటెంట్స్ మంజూరు చేయగా, 36 పేటెంట్స్ ప్రచురించబడ్డాయని, మరో 43 పేటెంట్స్ ప్రాసెస్‌లో వున్నాయన్నారు. అధ్యాపకుల సహకారంతో విద్యార్థులు ఇప్పటి వరకు 24 ఫార్మాస్యూటికల్ ప్రొడక్ట్స్ అభివృద్ధి చేశారని, వీటిలో కొన్ని ప్రొడక్ట్స్ ప్రధానమంత్రి జన ఔషధీ ద్వారా వివిధ రుగ్మతల నివారణకు ఉపయోగిస్తున్నారని తెలియజేశారు. ప్రస్తుత ఈ ఐడియా హాకత్తాన్ నాల్గవ పారిశ్రామిక విప్లవం వడ్రంగి, కుమ్మరి, కుండల తయారీ వంటి నైపుణ్య వ్యాపార ఆలోచనలతోపాటు ప్రధాన మంత్రి విశ్వకర్మ వాణిజ్యంలోని స్పోర్ట్స్ టెక్నాలజీస్, ఇంటర్నెట్ ఆన్ థింగ్(ఐఓటి), ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్(ఎఐ), అనేక ఇతర తయారీ రంగాలలోని ఆటోమేషన్లపై కూడా నూతన ఆలోచనలను స్వాగతిస్తుందన్నారు. ఈ ఆలోచనలు ప్రత్యేకంగా, వినూత్నంగా, సమాజానికి విలువలును అందించే విధంగా వుండాలని, ప్రతి ఆలోచనను 5గురు నిపుణులతో మూల్యాంకనం చేయబడుతుందన్నారు. ఎంచుకున్న ఆలోచనలు మంత్రిత్వశాఖ ఎంఎస్ఎంఇ ఇన్నోవేషన్ పథకం ద్వారా ఇంకుబేషన్ సపోర్ట్‌తోపాటు రూ.15 లక్షల వరకు నిధులు కూడా పొందవచ్చు అని అన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో సత్తా చాటిన తెనాలి విద్యార్థులు

ప్రజాశక్తి తెనాలి



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఈ నెల 14, 15 తేదీలలో అమలాపురం లో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ సబ్ జూనియర్ పోటీలలో వివిధ కేటగిరీలలో పట్టణానికి చెందిన రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులు బాక్ స్క్వాడ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులు ధనాల తను శ్రీ , షేక్ హనీఫ్ ,లీల నాగేంద్ర బాబు, యడ్ల తరుణ్ రాష్ట్రస్థాయి కి ఎంపికైన వారిలో ఉన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాబి అన్నారు. కార్యక్రమం లో ఎన్సిసి ఆఫీసర్ పరిశా సర్దార్ , వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద కుమారి, కొడాలి గోవర్ధన, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నెరెడ్కో అధ్యక్షునిగా గళ్లా రామచంద్రరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ (నెరెడ్కో) అమరావతి అధ్యక్షునిగా శ్రీ భ్రమర టౌన్షిప్ అధినేత గళ్ళా రామచంద్ర రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సాయంత్రం ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నెరడ్కో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొత్త కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గళ్ళా రామచంద్రరావుకు కమిటీకి నెరడ్కో బోర్డు సభ్యులు వి.వి.నర్సయ్య, జి.పున్నారావు, కె.రామకోటేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, రాజావరపు రవి, కొండయ్య తదితరులు ప్రసంగించారు. గళ్ళా రామచంద్రరావు మాట్లాడుతూ తనను ఈ పదవికి అధ్యక్షునిగా తనని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు దన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి ప్రాంతంలో అన్ని అనుమతులు ఉన్న అప్రూవుడ్ లే అవుట్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాజధాని అమరావతి అభివృద్ధికి కొత్త కమిటీ కృషి చేస్తుందన్నారు. కొత్తగా ఎన్నికైన కమిటీ అధ్యక్షులుగా గళ్ళా రామచంద్రరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఏ. సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా ఎన్ రాంబాబు, కోశాధికారిగా మారంచంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా ఎం.హనుమంతరావు, పెద్ది సుబ్బారావు, ఎం.రామకృష్ణ,. పి.వి.కే చైతన్య, జాయింట్ సెక్రటరీలుగా టి దుర్గాప్రసాదరావు ,జి శివ నాగబాబు అజీమతుల్లా, కార్యవర్గ సభ్యులుగా కె వి ఎస్ రామాంజనేయులు , ఎం సత్యనారాయణ , డి రమేష్ కుమార్, కే కష్ణ, జి.కష్ణ హేమంత్, డి.రమేష్‌కుమార్ తదితరులు ఎన్నికయ్యారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఆమోదం సరికాదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా పార్టీ కార్యాలయంలో గుంటూరు జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ గని ఆధ్వర్యంలో మైనార్టీ సెల్ కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ గని మాట్లాడుతూ వక్ఫ బోర్డు సవరణ బిల్లుపై దేశవ్యాప్తంగా ముస్లిం సామజికవర్గం తీవ్ర ఆందోళన చెందుతుందని అన్నారు.. వక్ఫ ఆస్తుల పరిరక్షణ వాటి బాధ్యత ఇప్పుడున్న చట్టాలు అనుకూలంగానే ఉండాలనియ ఏకగ్రీవంగా తీర్మానిస్తున్నట్టు తెలిపారు. రాబోయే పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో మైనార్టీలకు టిడిపి అవకాశం ఇవ్వాలని కోరారు. గుంటూరు మిర్చియార్డు చైర్మన్ తెలుగుదేశం పార్టీ ఈసారి మైనార్టీలకు కేటాయించాలని, ఇంతవరకు మైనార్టీలకు చైర్మన్ అవకాశం కల్పించలేదని, ఈసారి మైనార్టీలకు అవకాశం కల్పించాలని మైనార్టీ కార్యవర్గ సభ్యులందరూ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు షేక్ రుస్తుంబాబు, మీరా సాహెబ్, షేక్ రఫీ, షేక్ బాజీ, షేక్ జిలాని, మహమ్మద్ రఫీ, మహమ్మద్ బాషా, ఫిరోజ్, షేక్ జాన్ సైదా, ఎస్.ఎం ఇల్లాహి, పర్వేజ్, ఖాదర్ బాషా, షేక్ ఇర్ఫాన్, షేక్ మహబూబ్ జానీ, షేక్ సర్దార్, షేక్ జాన్ సైదా, షేక్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

29న జెవివి ఆధ్వర్యంలో ఎసి కాలేజీలో పిల్లల కథల పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, జెవివి నాయకులు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు ఏసీ కాలేజిలో పిల్లల కథల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. సోమవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. స్మార్ట్ ఫోన్లు, టివిలు వచ్చాక పిల్లల్లో ఆలోచనా శక్తి తగ్గిపోతుందన్నారు. ఈ నేపథ్యంలో పిల్లల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. 6-10వ తరగతి విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చున్నారు. ఎంట్రీ ఫీజు లేదని, పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఉంటుందన్నారు. ఈ పోటీలలో ఎంపిక చేసిన కథలను పుస్తకంగా రూపొందించి ప్రచురిస్తామన్నారు. కావున ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. ఇతర వివరాల కోసం 9000453600, 9948015701, 9703579996 నంబర్లలో సంప్రదించాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జెవివి నాయకులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, జి.వెంకటరావు, ఎస్.ఎం.సుభాని, బి.శంకర్ సింగ్, బి.ప్రతాప్‌సింగ్, ఇ.అనిల్‌కుమార్, ఎన్.వేణుగోపాల్, ఎండి. అక్బర్ పాల్గొన్నారు.

ముగిసిన యుటిఎఫ్ క్రీడా, సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు



క్రికెట్ విన్నర్స్ టీంతో యుటిఎఫ్ నాయకులు

గత రెండ్రోజులుగా యుటిఎఫ్ స్వర్ణోత్స వాలలో భాగంగా గుంటూరులో ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీలు ముగిశాయి. పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో సోమవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అనంతరం రెండ్రోజుల పోటీలలో విన్నర్స్‌ను ప్రకటించారు. ఉపాధ్యాయుల నుండి అనూహ్య స్పందన వచ్చిందని, దాదాపు 300 మంది ఉపాధ్యాయులు, 20మంది పిఇటిలు పాల్గొన్నారని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్ తెలిపారు. షటిల్‌లో కె.శ్రీనివాసరావు, వి.వినోద్‌బాబు, మహిళా షటిల్‌లో డైసీరాణి, మాధవి విజేతలుగా నిలిచారు. అలాగే చెస్‌లో జి.రమేష్ బాబు, మహిళల విభాగంలో పి.శివలక్ష్మి, క్యారమ్స్ పోటీల్లో వి.వినోద్‌బాబు, మస్తాన్‌వలి, మహిళా విభాగంలో డి.లీలా, డి.అమూల్య గెలుపొందారు. వాలీబాల్ పోటీల్లో వట్టిచెరుకూరు టీం విన్నర్స్‌గా, గుంటూరు సిటీ టీం రన్నర్స్‌గా నిలిచారు. క్రికెట్‌లో గుంటూ రుకు చెందిన వన్‌లైన్ మాస్టర్స్ టీం విన్నర్స్‌గా, తెనాలి టౌన్ ఫ్రెండ్స్ టీం రన్నర్స్‌గా నిలిచారు. పాటల పోటీల్లో అంకారావు, పిఎం.శర్మ, ఎన్.అరుణ, పి.కుమారి, జి.స్టాంకబాబు, జయరూపశ్రీ గెలుపొందారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులను క్రీడల్లో పాల్గొన్న వారిని, గెలుపొందిన వారిని అభినందించారు. ముగింపు కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ యం.హనుమంతరావు, జిల్లా నాయకులు జి.వెంకటేశ్వర్లు, ఎండి.దౌలా, సిహెచ్.ఆదినారాయణ, యు.రాజశేఖర్‌రావు, కె.సాంబశివరావు, జి.వెంకటేశ్వరరావు, యం.గోవిందయ్య, యం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్, కె.ప్రభూజీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల కోసం రాజీలేని పోరాటాలు

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర నాయకులు ముజఫర్, యూనియన్ అధ్యక్షులు రామారావు

ఆర్టీసీ కార్మికుల హక్కులు డిమాండ్ల సాధన కోసం సిఐటియు అనుబంధ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాజీలేని ఎన్నో పోరాటాలు సమర్థవంతంగా నడిపిందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహమ్మద్ అన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం వినుకొండ రోడ్డులోని ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయం వద్ద జెండాను యూనియన్ అధ్యక్షులు రామారావు సోమవారం ఆవిష్కరించారు. ముజఫర్ అహమ్మద్ మాట్లాడుతూ ఐక్యత, పోరాటం నినాదంతో ఆర్టీసీలో కార్మిక, ఉద్యోగ సమస్యల పరిష్కారానికి, సంస్థ అభివృద్ధి కోసం ఎస్‌డబ్ల్యూఎఫ్ ఎల్లప్పుడూ ముందు పీఠిన ఉంటుందన్నారు. కార్మిక, ఉద్యోగులను చైతన్య పరచడంలో, రాబోయే సమస్యలను ముందుగా గుర్తించి, యాజమాన్యాన్ని, తోటి యూనియన్లను హెచ్చరించడంలో, ఆర్టీసి అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి విశేష కృషి చేసిందని చెప్పారు. ప్రభుత్వంలో సంస్థ విలీనం తరువాత ఉద్యోగ, కార్మికులు కోల్పోయిన హక్కులు తిరిగి సాధించేంత వరకూ విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్.కోటేశ్వరరావు, నాయకులు జి.కృష్ణ, సుభాష్ చంద్రబోస్, మస్తాన్‌రావు, శ్రీనివాసరావు, పెద్దసింగ్, మస్తాన్‌వలి, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, శివకుమారి, సిలార్ మసూద్, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి



జెండా ఆవిష్కరిస్తున్న జెవి రాఘవులు

ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం నిరం తరం పోరాడేది ఎస్ డబ్ల్యూ ఎఫ్ అని సిఐ టియు సీనియర్ నాయ కులు జెవి రాఘవులు అన్నారు. ఎస్ డబ్ల్యూ ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం మంగళగిరి కొత్త బస్టాండ్ సెంటర్లో జెండాను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా రాఘవులు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను ఉద్యోగులుగా గుర్తించి నప్పటికీ వారికి ఇవ్వాల్సిన రాయితీలను ఇంకా అమలు చేయడం లేదని అన్నారు. కార్యక్రమంలో ఎస్ డబ్ల్యూ ఎఫ్ డిపో కార్యదర్శి కే పాములు, నాయకులు ఎంబిఎల్ దేవి, పి బాలకృష్ణ, సిఐటి యు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, సిఐటియు నాయకులు షేక్ జానీ భాష, టి శ్రీనివాసరావు, వి పూర్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.